వెళ్లినా సరే మిమ్మల్ని వెంటాడుతూ ఉంటాడు. వాడు గురువు. ఆచార్యులవారికి పద్మపాదుడికి కాశీలో మణికర్ణికాఘాట్‌లో వారిద్దరికి స్నేహం కలిసింది ఆ స్నేహం చనిపోయేవరకు అలాగే ఉంది. అది మైత్రి. వారిది జన్మాంతర అనుబంధం. కృష్ణుడు లాస్ట్ మినిట్‌లో అయినా దుర్యోధనుడితో స్నేహం వదిలెయ్యమని కర్ణుడికి చెప్తాడు. నువ్వు చెప్పినట్లు దుర్యోధనుడు మంచివాడు కాకపోవచ్చు అయినా నాకు రాజ్యము లేనపుడు రాజ్యము ఇచ్చాడు, నాకు సింహాసనం ఇచ్చాడు, నన్ను ఆయనతో సమానంగా కూర్చోబెట్టు కునేవాడు. ఈ క్లిష్ట సమయంలో విడిచిపెట్టిరావటం ఇది స్నేహ ధర్మమా! నా తల తీసేసినా స్నేహం విడిచిపెట్టను అన్నాడు. వాడు కర్ణుడు. అది మైత్రి. భగవాన్ అరుణాచలం వచ్చి తనను తాను అరుణాచలేశ్వరుడికి అర్పించుకున్నాక ఇంక ఆయనకి ఎప్పడూ వేవరింగ్ రాలేదు. అరుణాచలం విడిచిపెట్టి కాశీ చూచివద్దాము, రామేశ్వరం చూచివద్దాము అనే తలంపు కూడా ఎప్పడూ రాలేదు. అది జన్మాంతర అనుబంధం. అరుణాచలాన్ని స్మరిస్తూ ఉంటే ఆయన నీ దేహాన్ని చంపడు, ఈ దేహం నాది అనే తలంపుని చంపేస్తాడు. ఇది చంపక చంపెడు మందు. మీరు అరుణాచలం సరదాగా వచ్చిన ఆయన చెయ్యవలసిన పని ఆయన చేసేస్తాడు. ఈ అరుణాచలాన్ని దర్శించిన వాడు ఒట్టి చేతులతో వెళ్లడు. నాస్తికుడు ఆస్తికుడు అవుతాడు, ఆస్తికుడు భక్తుడు అవుతాడు, భక్తుడు జ్ఞాని అవుతాడు. మీ తలంపుతో సంబంధం లేకుండా అరుణాచలేశ్వరుడు రహస్యంగా చేసుకువెళ్లిపోతూ ఉంటాడు. ఆయన స్వభావం అది. అరుణాచలేశ్వరుడు ఆనందం ఇస్తాడు అని నేను ఇతరులకు చెప్పటం కూడా నీకు ఇష్టం ఉండదు. అయినా నేను చెబుతున్నాను నీకు ఇష్టం లేని పని నేను చేస్తున్నాను కాబట్టి నన్ను క్షమించు అరుణాచలేశ్వరుడా అంటారు భగవాన్.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 13-12-2009, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మీ పని ఏదో మీరు శ్రద్ధగా చేసుకుంటూ మిగతా టైములో సాధన చేసుకోండి. మనం పొందవలసిన స్థితి ఏదో శరీరం జీవించి ఉండగానే పొందాలి. మనం భగవదనుభవం పొందాలి. మనం మరణానంతరం వెడితే మంచి లోకాలకు వెడతాము లేకపోతే చెడ్డలోకాలకి వెడతాము కాని సాధనలోకాలకి వెళ్లము. ఈ భూమి మీదే మనం సాధన చేసుకోవాలి. అందుచేత మీరు కాలాన్ని వృధా చేసుకోవద్దు. మనకు అన్ని అవకాశాలు ఉన్నా, బీదవారు ఎలా బతుకుతున్నారో అలా మనం బతుకుతూ ఉంటే ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి వస్తాము. బీదవాడు బట్టలలో నిరాడంబరంగా ఉంటాడు. వాడు అన్నం ఏదో సరిపడ తింటాడు

అంతకంటే ఉండదు. మీరు ఎంత ధనవంతులైనా బీదవాళ్ళు ఎలా బతుకుతున్నారో అలా మనం బతకటం నేర్చుకుంటే మనకి ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం వస్తుంది. వారే మనకి గురువులు. అందుచేత సాధనలో బహుమెలుకువగా ఉండాలి. ఎవరినీ ద్వేషించకుండా, ఏదీ కాంక్షించకుండా ఉంటే వాడు నిత్యసన్యాసి అని పరమాత్మ చెప్పాడు. మనకి లేనిది ఇతరులకు ఉంటే వారిమీద మనకు ద్వేషం వస్తుంది. ద్వేషం ఎక్కడ నుంచి వస్తుంది అంటే కోరికలోంచి వస్తుంది. కోరికలోంచి కోపం వస్తుంది. కోరికపైకి మనకి మిత్రుడిలాగ కనిపిస్తాడు కాని శత్రువు చేసేపని చేస్తాడు. కోరిక మనకి ఉపకారం చేసినట్టే ఉంటుంది కానీ అది అపకారం చేసేస్తుంది. అందుచేత ఆధ్యాత్మిక మార్గంలో వారు అలా ఉంటున్నారు, వీరు ఇలా ఉంటున్నారు అని అనుకరణ ఉండకూడదు. మనం సాధన చేసి అన్ని విషయాలను నియమించుకోవాలి. అన్ని పరిస్థితులలో కూడా నిగ్రహంగా ఉండాలి. మీకు ధనం ఉన్నా, విద్య ఉన్నా వాటిని నిగ్రహంలో పెట్టుకోవాలి. నిగ్రహంగా లేకపోతే ఆగ్రహం వస్తుంది. మీకు నిగ్రహం లేదు అనుకోండి మిమ్మల్ని ఇతరులు పాడుచెయ్యనక్కరలేదు మీ పాండిత్యము, మీ ఐశ్వర్యము మిమ్మల్ని పాడుచేసేస్తుంది. అందుచేత ప్రాపంచిక మనుషులతోటి అనుకరణ పనికిరాదు. మనం శాస్త్రాన్ని ఆధారంగా పెట్టుకోవాలి. భగవంతుడు చెప్పినట్లు నడుచుకోవాలి.

మన సాధన యొక్క లక్ష్యం ఏమిటి అంటే దేహాభిమానంలోంచి బయటకు రావాలి. మన మాట, చేత, ఆలోచనలకు భగవంతుడే కేంద్రంగా ఉండాలి. అలాగైతేనే వ్యక్తిభావన నశిస్తుంది. గాఢనిద్రలో వ్యక్తిభావన లేదు ఎందుచేతనంటే అక్కడ మనస్సులేదు, ఇంద్రియాలులేవు, దేహం గొడవలేదు. గాఢనిద్రలో వ్యక్తిభావన లేకుండా ఎలా ఉండగలిగామో అలాగే జాగ్రదవస్థలో వ్యక్తిభావన లేకుండా మీరు ఉండగలిగితే మీ శరీరం చనిపోనక్కరలేదు. ఇప్పుడే మీ హృదయంలో ఉన్న ఆనందసముద్రం పొంగి మీ సహస్రారాన్ని ముంచేస్తుంది. అప్పుడు మనం ఆనందం కోసం, శాంతికోసం, సుఖంకోసం ఒక పదార్థం మీదకాని, ఒక మనిషిమీదకాని ఆధారపడనక్కరలేదు. మీరు సాధన చేసి, సాధన చేసి మీ హృదయంలో ఉన్న ఆనంద సముద్రంలో మునిగితే మీరు అనేకమందికి ఆనందాన్ని, శాంతిని పంచిపెట్టవచ్చు. అసలు మీకే లేనిది ఇతరులకు ఏమి పంచిపెడతారు. రమణ మహర్షిగారిలో, రామకృష్ణపరమహంస గారిలో ఏదో ఉంది. మనలో అది లేదు అనుకోకండి. మనలో ఏది ఉందో వారిలోనూ అదే ఉంది. మనకీ వారికీ తేడా ఏమిటి అంటే వారిలో ఉన్నది వారు తెలుసుకున్నారు. మనలో ఉన్నది మనకు తెలియటంలేదు. అందుచేత మీరు ఈశ్వరుడిపట్ల గౌరవంగా ఉండి, ఈశ్వరుడి పట్ల ఆరాధన కలిగి, ఈశ్వరుడు చెప్పినమాటలను మననం

చేసుకుంటూ ఉంటే మీ కళ్ళకు కనబడకుండా మీ చెవులకు వినబడకుండా మీకు గొప్ప ఉపకారం చేస్తాడు ఈశ్వరుడు. మీతోటి మాట్లాడాలి అంటే ఆయనకి నోరు అక్కరలేదు మంచి ఆలోచనను మీ హృదయంలోనే స్ఫురింపచేస్తాడు. ఈశ్వరుడు సర్వశక్తిమంతుడు. నేను, జ్ఞాని ఒక్కటి అంటే ఒక్కటే అని పరమాత్మ చెపుతాడు. ఇద్దరికీ భేదం చూడనక్కరలేదు. పరమాత్మ మన హృదయంలో ఆత్మగా ఉన్నాడు. అది ఎప్పడు అయితే నీకు అనుభవంలోనికి వచ్చిందో అప్పడు ఈశ్వర స్వరూపాన్ని పొందుతారు. అప్పడు ఈశ్వరుడు కంటే మనం భిన్నం అనే భావన పోతుంది.

జ్ఞానికి ఈశ్వరసంకల్పమే తన సంకల్పం, ఈశ్వరుని ఇష్టమే తన ఇష్టం అందుచేత జ్ఞానికి దుఃఖం ఉండదు. మన సంకల్పం ఒకటి అయ్యుండి ఈశ్వరసంకల్పం ఇంకొకటి అయితే మనకి దుఃఖం వస్తుంది. అసలు మనం పాడైపోవటానికి కారణం ఇష్టాఅయిష్టాలు. మనకి ఇష్టం ఉన్నా మనస్సు బాహ్యముఖానికి వెళ్ళిపోతుంది, అయిష్టం ఉన్నా మనస్సు బాహ్యముఖానికి వెళ్ళిపోతుంది. మనకి ఇష్టాలు, అయిష్టాలు లేకపోతే మనస్సు ఇంక బాహ్యముఖానికి వెళ్ళదు. నువ్వు వేరు, నేను వేరు అనే భేదబుద్ధి తగ్గించుకుంటూ ఉంటే మనస్సు పలచబడిపోతుంది. మన మనస్సును మనం బాగుచేసుకోవటం కంటే మించిన పని లేదు, మనస్సును బాగుచేసుకోవటం కంటే మించిన సాధన లేదు. మీ మనస్సు మీకు అదుపులో ఉంటే మీ బంధువులు, మీ స్నేహితులు, మీ డబ్బు ఇవ్వలేని శాంతి, సుఖము మీ మనస్సే మీకు ప్రసాదిస్తుంది. నీ మనస్సుని నువ్వు ఎప్పడూ విరోధిగా పెట్టుకోవద్దు, స్నేహితుడిగా మార్చుకో. నువ్వు చేయవలసిన సాధన అదే. శరీరం చనిపోయిన తరువాత మన కూడా ప్రయాణం చేసేది మనస్సే. అందుచేత మనస్సుకి ట్రైనింగు ఇచ్చి శరీరం ఉండగానే దాని మూలమైన హృదయంలో ఐక్యం చేయగలిగితే మనస్సు ఇంక ప్రయాణం చేయదు. ఎప్పడు అయితే మనస్సుకి ప్రయాణం ఆగిపోయిందో ఇంక పునర్జన్మ లేదు. రాగద్వేషాలలోంచి ఎవరి మనస్సు అయితే పూర్తిగా విడుదల పొందిందో వారు మాత్రమే సంసారాన్ని జయించగలరు. భూమి మీద మెరకాపల్లాలు ఎలా ఉంటాయో అలాగే నీ మనస్సులో హెచ్చుతగ్గులు కనుక ఉంటే సంసారాన్ని జయించలేవు. సంసారం అంటే నీ ఇంట్లో ఉన్న మనుషులు కాదు. నీ మనస్సే సంసారము. బ్రహ్మము నిరాకారము, నిర్గుణము. అది అంతటా వ్యాపించి ఉంది. అదే మన హృదయంలో కూడా ఉంది. అందుచేత నీ హృదయంలో ఉన్న ఆ మూలపదార్థాన్ని నువ్వు తెలుసుకొంటే ప్రపంచం అంతా వ్యాపించి ఉన్న వస్తువు నీ హృదయంలో ఉన్న వస్తువు ఒక్కటే అన్న సంగతి నీకు తెలుస్తుంది. ఇప్పడు మనం శరీరంలో నిలబడి ఉన్నాము, మనస్సులో నిలబడి ఉన్నాము. ఇంద్రియాలలో నిలబడి ఉన్నాము, ఇష్టంలో నిలబడి ఉన్నాము, అయిష్టంలో

నిలబడి ఉన్నాము. అలా కాకుండా అంతటా వ్యాపించి ఉన్న బ్రహ్మములో నువ్వు నిలబడి ఉంటే, అక్కడ స్థిరంగా ఉండగలిగితే అప్పుడు నిన్ను సంసారం విడిచిపెట్టేస్తుంది. అప్పటివరకు సంసారం నిన్ను వెంటాడుతూనే ఉంటుంది. చనిపోతే సంసారం పోతుంది అనుకోకండి చనిపోతే శరీరాలు మారతాయి కాని సంసారం వచ్చేస్తుంది. నువ్వు చనిపోతే శరీరంలోంచి బయటకు రాగలవు కాని మనస్సులోంచి ఎలా బయటకు వస్తావు. అది నిన్ను వెంటాడుతుంది. నీ మనస్సులో ఎన్ని దోషాలు ఉన్నాయో ఆ దోషాల్లోంచి నువ్వు విడుదల పొందేవరకు ఏ దోషము నిన్ను విడిచిపెట్టదు. మీ మనస్సులో ఏదైనా దోషం ఉందనుకోండి అది ఇతరులకు తెలియకపోవచ్చు కాని నీకు తెలుస్తూ ఉంటుంది. నీ మనస్సులో ఉన్న దోషంలోంచి నువ్వు విడుదల పొందాలి అదే సాధన. బ్రహ్మము ఎంత నిర్దోషముగా ఉందో నీ మనస్సుకూడా అంత నిర్దోషముగా ఉంటేనే బ్రహ్మాకారం చెందుతుంది. అప్పుడు నిన్ను సంసారం విడిచిపెడుతుంది.

మన ముఖం అద్దంలో చూచుకున్నప్పడు మన ముఖంలో ఎక్కడైనా మసి కనబడితే ఆ మసిని మనం తుడిచేసుకుంటాము. అలాగే శాస్త్రం అద్దం లాంటిది. మన మనస్సులో దోషాలు ఏమిటో భగవంతుడు చెబుతూ ఉంటాడు. ఆ దోషాలు ఉన్నాయో లేదో శాస్త్రం చూపిస్తూ ఉంటుంది. శాస్త్రం ఆ దోషాన్ని తీయదు, మనం సాధన చేసి గురువు అనుగ్రహం సంపాదించి, ఈశ్వరానుగ్రహం సంపాదించి ఆ దోషాన్ని మనమే తొలగించుకోవాలి. దోషం ఎంత బరువుగా ఉందో అంత సాధన చేస్తేకాని అందులోంచి విడుదల పొందలేము. కర్తురాజ్ఞయా అంటే అక్కడ ఈశ్వరుని ఆజ్ఞ అనుసరించి మీకు ఫలితం వస్తుంది. మీ తెలివి తేటలవల్ల ఫలితం రావటంలేదు. ప్రతీ జీవుడికి ఒకో ప్రారబ్దం ఉంటుంది. ఈశ్వరుడు ఆ ప్రారబ్దాన్ని అనుసరించి ఫలితాన్ని ఇస్తాడు. అది మన ప్రారబ్దమే అని తెలియక ఈశ్వరుడు చేసాడు అనుకుంటాము. ఈశ్వరుడు కాదు మన ప్రారబ్దమే దానికి కారణం అని అర్థం చేసుకొంటే మనం ఈశ్వరుడిమీద నిందలు వేయటం మానేస్తాము. ప్రారబ్దం అనుభవించేటప్పడు అది నీకు ఇష్టం లేకపోయినా ఇష్టంగా కనుక దానిని అనుభవిస్తే రాబోయే జన్మలలో ఆ ప్రారబ్దం నీకు ఎదురవ్వదు. ప్రారబ్దంలో ఉన్నది మీకు కేటాయిస్తాడు. అంతేకాని లేనిది మీకు కేటాయించడు. ఉన్నది తీసేయడు, లేనిది కలపడు. బ్రహ్మము ఎంత నిర్దోషముగా ఉందో అలాగ నీ మనస్సు నిర్దోషముగా లేకపోతే శాస్త్రాన్ని పరిశీలించుకొని ఆ దోషాలు ఏమిటో జాగ్రత్తగా చూచుకొని ఒకో దోషంలోంచి, ఒకో దోషంలోంచి విడుదల పొందటమే సాధన. మీరు పూజ చేయండి, జపం చేయండి, ధ్యానం చేయండి, క్షేత్రాలని దర్శించండి ఎన్ని చేసినా ఆ దోషంలోంచి బయటకు రావటమే సాధన యొక్క ప్రయోజనం.

తపస్సు అంటే ఎండింపజేయటం. మీ మనస్సుని ఎండింపచేయగా, ఎండింపచేయగా అప్పడు మీ మనస్సులో ఉన్న దోషాలు పోతాయి. అప్పడు మనస్సు నిర్దోషం అయి, నీ మనస్సు వెళ్లి బ్రహ్మములో నిలబడుతుంది. మీరు ఎంత సాధన చేస్తూ ఉన్నా మీకు ఆహారనియమం లేకపోతే మొత్తం సాధన అంతా పాడైపోతుంది. మీరు తిండి దగ్గర బహుజాగ్రత్తగా ఉంటే మీ మనస్సు మీకు స్వాధీనంలోకి వస్తుంది. మనం అన్ని ఇంద్రియాలని కంట్రోలులోకి తెచ్చుకోవాలి. కొన్ని ఇంద్రియాలను నియమించుకుని కొన్ని ఇంద్రియాలను వదిలేసినా సాధన నిలబడదు. చెడ్డ విషయాలు వింటే, చెడ్డ విషయాలు చూస్తూ ఉంటే చెడ్డ ఆలోచనలు రాకుండా మనం ఆపుచేయలేము. అందుచేత చూచే దృశ్యాల విషయంలో, చెవులతోటి వినే విషయాలలో బహుజాగ్రత్తగా ఉండాలి.

బయట పరిస్థితులు మనకు అనుకూలంగా ఉంటే మనకి తప్పనిసరిగా పొంగువస్తుంది. నువ్వు ఎందుకు పొంగిపోతున్నావో దేవుడికి సమాధానం చెప్పాలి. మన పరిస్థితులు బాగాలేవు అనుకోండి దుఃఖం వచ్చేస్తుంది. నువ్వు ఎందుకు దుఃఖపడుతున్నావో దేవుడికి సమాధానం చెప్పాలి. దీనినిబట్టి సాధనచేయటం ఎంత కష్టమో చూడండి. మీరు ఏదివచ్చినా అందులో కలవకండి మీ అబ్బాయి మంచివాడు అయితే వాడిని అలాగ ఉండనివ్వండి. మీ అబ్బాయి మంచివాడు అని మనస్సులో సంతోషం పీల్చుకోకండి. మీరు పీల్చుకుంటే మళ్లీ ఎప్పటికైనా ఆ సంతోషం దుఃఖంకింద మారిపోతుంది. మీ అబ్బాయి చెడ్డవాడు అనుకోండి మా అబ్బాయి చెడ్డవాడు, చెడ్డవాడు అని మీరు మొయ్యవద్దు. మీరు మోస్తే దుఃఖం ప్రారంభమవుతుంది, మంచివాళ్లని మోస్తే సంతోషం ప్రారంభమవుతుంది. ఈ రెండింటికి ఏదో జన్మలో మీరు భగవంతుడికి సమాధానం చెప్పకోవలసిందే. ధర్మము అంటే కేవలము దానము అని కాదు. మీకు పది రూపాయలు ఉంటే ఎవరికైనా సహాయం చేస్తే పుణ్యం వస్తుంది కాని బ్రహ్మజ్ఞానం రాదు. ధర్మము అంటే ఒక జీవిత విధానం. నువ్వు ఎలా జీవిస్తే భగవంతుడిలో ఐక్యమవుతావో అలా జీవించటం నేర్చుకోవటమే ధర్మము. మీరు ఎవరికి సహాయం చెయ్యకపోతే పాపం రావచ్చు. పాపం వస్తే దుఃఖము వస్తుంది. దీనికి బ్రహ్మజ్ఞానానికి సంబంధం లేదు. పాపం వస్తే దుఃఖంగా కరిగిపోతుంది, పుణ్యం వస్తే సుఖంగా కరిగిపోతుంది. మీరు ఎవరికైనా పదిరూపాయలు పెట్టారనుకోండి, వాడు ఎప్పడైనా మీరు నాకేమి పెట్టలేదు అంటే అప్పడు మీకు కోపం వస్తుంది. కోపం ఎందుకు వస్తుంది, నేను పెట్టాను అనే భావన మీకు ఉంది కాబట్టి అలా ఉంటే ఇంక మీ మనస్సు బాగుపడదు. మీరు పతనమైనట్టే. మాకు ఇష్టం ఉన్నా, లేకపోయినా మా డ్యూటీ చెయ్యాలికదా అని డ్యూటీ చేస్తున్నాం అని చాలామంది అంటారు. నేను చేస్తున్నాను అనే భావన లేకుండా చెయ్యి అది ధర్మం. ధర్మాన్ని ఆచరించేవాడు డ్యూటీ ప్రేమగా చేస్తాడు. నువ్వు చేసేది ప్రేమగా చేస్తే మనస్సు, ఇంద్రియాలు బ్రహ్మమువైపుకి ఉపసంహరించుకుంటాయి. ఇంద్రియాలు

వెళ్ళి మనస్సులో ఐక్యమవుతాయి, మనస్సు వెళ్ళి బ్రహ్మములో ఐక్యమవుతుంది. అలా జీవించే విధానం నేర్చుకోవటమే ధర్మము.

దైవములో నీ మనస్సుని నిలబెట్టి ఉంచాలి. దైవములో నీ మనస్సుని నిలబెట్టి ఉంచలేకపోతే నీ మనస్సు అన్యవిషయాలని చింతిస్తూ ఉంటుంది. మనస్సు ఏ విషయం అయితే చింతిస్తోందో అక్కడికి ముందు మనస్సు వెళ్ళిపోతుంది. వెళ్ళిపోయి అది ఆగదు మన శరీరాన్ని కూడా తీసుకుపోతుంది. మన శరీరాన్ని నరకంలో పెట్టేది మనస్సే, మనకి మోక్షాన్ని కలగజేసేది కూడా మన మనస్సే. సంతోషం వచ్చినప్పుడు పొంగిపోకూడదు, దుఃఖం వచ్చినప్పుడు కుంగిపోకూడదు అనే మాటలు నువ్వు వినవచ్చు. విన్నా నువ్వు అలా ఉండలేవు. ఆత్మచింతన తప్ప ఇతర చింతన లేకుండా నీ మనస్సు ఉన్నప్పుడు మాత్రమే నువ్వు పొంగిపోకుండా, కుంగిపోకుండా ఉండగలవు. అది మనకి అనుభవంలో తెలుస్తూ ఉంటుంది. నువ్వు ఆత్మసుఖాన్ని పొందితే, ఆత్మశాంతిని కనుక పొందితే బాహ్యవిషయాలలోకి నీ మనస్సు వెళ్ళదు. బాహ్య విషయాలు అన్నీ స్పర్శ సుఖాలు. హృదయంలో ఉన్న ఆత్మసుఖం మనకి అనుభవంలో ఉన్నప్పుడు స్పర్శసుఖాలు అన్నీ ఎదురుగుండా ఉన్నప్పటికీ మనస్సు వెళ్ళి అందులో చిక్కుకోదు, అందులో బంధింపబడదు. ఇక్కడ ఆత్మసుఖం లేదు అనుకోండి, శాంతి లేదు అనుకోండి తప్పనిసరిగా బాహ్యవిషయాలలోకి వెళ్ళి బంధింపబడుతుంది. భగవాన్ అరుణాచలేశ్వరుడితో ఏమన్నారు అంటే నేను ఎప్పుడూ నారాయణస్మరణగాని, శివస్మరణగాని చేయలేదే, పూజలేదు, తీర్థయాత్రలు లేవు నేను ఏమీ సాధన చేయలేదు, అరుణాచలం అన్నాను అంతే నా నేనుని తీసేసుకుని నీ నేనుని నాకు ప్రసాదించావు. నీలో ఐక్యం చేసేసుకున్నావు. నీవూ నేను అనే బేధబుద్ధి లేకుండా చేసేసావు. నువ్వు వేరు నేను వేరు అనే బేధబుద్ధి ఉన్నంతకాలం అక్కడ మనస్సు ఉందని అర్థం. మనస్సు ఉన్నంతకాలం నీకు సంసారం తప్పదు. ఆ నేనుని నువ్వు తినేటప్పుడు నాకు నొప్పిలేకుండా తీసేసావు. ఏదైతే నేను నేను అనుకుంటున్నానో ఆ నేను నాకు కాకుండా చేసేసావు అరుణాచలేశ్వరుడా. నా జీవలక్షణాలన్నీ తీసేసావు అరుణాచలేశ్వరుడా అన్నారు. నీ ప్రారబ్దం మంచిది అయినా, నీ ప్రారబ్దం చెడ్డది అయినా నీకేమీ సంబంధం లేదు. ప్రారబ్దం నువ్వు కాదు కదా అన్నారు భగవాన్. మీకు నూటికి నూరుపాళ్ళు చెడ్డ ప్రారబ్దం ఉంది అనుకోండి మీ శరీరం మీరు కాదని మీకు అర్థం అయ్యింది అనుకోండి ఆ ప్రారబ్దం మిమ్మల్ని ఏమీ ముట్టుకోదు అని చెప్పారు. ప్రారబ్దం దేహానికే లోపల చైతన్యానికి ఏమీ లేదు. పుట్టిన దానికి ప్రారబ్దం ఉంటుంది కాని పుట్టనిదానికి ప్రారబ్దం ఉండదు. తుకారామ్ చాలా కష్టాలు పడ్డాడు. మనకి కష్టాలు వస్తే ఈ కష్టాలు ఎప్పుడూ పోతాయి అని అనుకుంటాము కాని తుకారామ్ ఓ పాండురంగా నువ్వు నాకు కష్టాలు పంపుతున్నావు ఆ కష్టం

కష్టంగా ఉండటంలేదు. నాకు ఎన్ని కష్టాలు ఉన్నాయో అన్నీ పంపేసావు. అదనంగా నీవు ఏవైనా కష్టాలు పంపుదామన్నా నీ దగ్గర ఇంక ఏమీలేవు. ఓ పాండురంగా నా చేతిలో నువ్వే ఓడిపోయావు అన్నాడు. తుకారామ్ ప్రారబ్దాన్ని ఇష్టంతోటి అనుభవించాడు. నా లోపల ఏదో నేను ఉంది అంటున్నారు. ఆ నేనును పోగొట్టుకోవాలని ఎప్పడూ ప్రయత్నం చేయలేదు. అది తీసుకువచ్చే అరిష్టాలు కూడా నాకు తెలియదు. పాండురంగడిపట్ల ఉన్న ప్రేమ, ఆప్యాయత, భక్తి, ఇష్టం తప్పించి ఇంకోటి నాకు తెలియదు. పాండురంగడిపట్ల నాకు ఉన్న విశ్వాసంలో, ఆ భక్తి ప్రవాహంలో, ఆ ప్రేమప్రవాహంలో ఈ నేను ఎప్పడు కొట్టుకుపోయిందో నాకు తెలియదు. కొట్టుకుపోయాక తెలిసింది అన్నాడు వాడు తుకారామ్. వాడికి వైకుంఠం నుండి విమానం వచ్చింది.

సూర్యుడు ముందు కిరసనాయిలు దీపం ఎలా ఉంటుందో మీకు ఆత్మసుఖం అనుభవంలో ఉన్నప్పడు విషయ సుఖాలు అలా ఉంటాయి. అసలు విషయాలు పట్ల మీకు ఆకర్షణ కలగదు. మీ శరీరంలో ఉన్న ప్రాణం పోయే టైముకి మీరు నూటికి నూరుపాళ్ళు ఆనందంగా, శాంతిగా ఉండగలిగితే మీకు పునర్జన్మ లేదు. ఇది మీరు గుర్తుపెట్టుకోండి. అలా ఉండటం కష్టమే. మన మనస్సు ఇష్టం మీదకో, అయిష్టం మీదకో వెళ్ళిపోతుంది. అది ఆత్మసుఖంలో నిలబడి ఉండదు. విషయస్పర్శతో సంబంధం లేకుండా, మనో దేహములతో సంబంధం లేకుండా, లోకంతో సంబంధం లేకుండా, సంసారంతో సంబంధం లేకుండా నూటికి నూరుపాళ్ళు శాంతిగా ఉండగలిగితే నీకు పునర్జన్మ లేదు. నీకు జన్మ వస్తుందా లేదా అని శాస్త్రం చదవనక్కరలేదు. ఇది నీకు కొండ గుర్తు. సుఖం వేరు, సంతోషం వేరు. విషయస్పర్శ వల్ల వచ్చేది సంతోషం, ఆత్మలోంచి వచ్చేది సుఖం. సంతోషంలో కలుషితం ఉంటుంది. ఆత్మసుఖంలో కలుషితం ఉండదు. ఈ శరీరం భూమి మీద తిరుగుతున్నప్పడే, మీరు సమాజం మధ్యలో ఉన్నప్పడే కోరిక యొక్క వేగం, కోపం యొక్క వేగం నూటికి నూరుపాళ్ళు మీరు తట్టుకోగలిగితే మీ శరీరం రాలిపోవటం, మీరు సుఖసముద్రంలో ఐక్యమైపోవటం ఒకేసారి జరిగిపోతాయి. అప్పడు మీ మనస్సు ఇంక ప్రయాణం చేయనక్కరలేదు. మీరు ఎంత గొప్ప లోకాలకి వెళ్ళినా మళ్ళీ తిరిగి ఈ భూమి మీదకు వచ్చి సాధన చేసుకోవాలి. అందుచేత కాలాన్ని పాడుచేసుకోకూడదు. ముందు నీ మనస్సులో ఉన్న కల్మషాన్ని, కపటాన్ని తొలగించుకోవటానికి ప్రయత్నం చెయ్యి అదే సాధన. కపటికి జ్ఞానం ఏమిటి? నిరంతరము ఈశ్వరుడిని స్మరించటం వలన, నిరంతరము ఈశ్వరుడి దయ సంపాదించే ప్రయత్నంలో ఉండటం వల్ల మనస్సులో ఉన్న కల్మషాలన్నీ పల్చబడిపోతాయి. ఎవడైతే మనస్సులో ఉన్న కల్మషాలని సాధన చేసి, సాధన చేసి కష్టపడి ఆ కల్మషాలను పోగొట్టుకుంటాడో వాడు మాత్రమే బ్రహ్మములో ఐక్యమవుతాడు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| జనవరి | 30 | వాలమర్రు |
| ఫిబ్రవరి | 4 | గీతామందిరం, సఖినేటిపల్లి |
| ఫిబ్రవరి | 12 | చించినాడ (శివరాత్రి) |
| ఫిబ్రవరి | 21 | శివ కళ్యాణ మండపం, భీమవరం |

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**

# 2010 నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు

## భగవాన్ శ్రీ రమణ మహర్షి

గొప్ప మాటలు ఆశయాలు వల్లించడం కన్నా కొద్ది వాటినైనా ఆచరించి చూపడం ముఖ్యం, దానినే ఆచరణ వేదాంతం అంటారు. సకల జీవకోటి శాంతి సౌభాగ్యాల కోసం తమ జీవితాలను పరిపూర్ణంగా అంకితం చేసిన వారే మహాత్ములు. అట్టి మహాత్ములలో ఒకరైన అరుణాచల ఋషి, భగవాన్ రమణ మహర్షి తన పదిహేడవ ఏట అమృతానుభవం ద్వారా జ్ఞాన సింహాసనాన్ని అధిష్టించి తరువాత తన జీవితాంతం జీవన్ముక్తునిగా అరుణాచలంలో సంచరించి సకల సృష్టికి మార్గదర్శిగా నిలిచారు. భగవాన్ నిరాడంబరులు మరియు నిజమైన ఆధునిక సమతావాది. విశ్వశ్రేయస్సే వారి శ్రేయస్సుగా భావించారు. తానున్న అద్వయ స్థితిలోకి జీవకోటిని నడిపించటానికి నిరంతరం పాటుపడిన సహృదయ సంపన్నుడు. మానవుల స్వీయ అభివృద్ధికి ఆటంకం వారి దేహాత్మబుద్ధియే కారణమని బోధించి దానినుండి విడుదల పొందుటకు ఆచరణ మార్గమును సూచించి అందరిని తరింపజేయుటకు జీవితాంతం కృషి చేసారు. ఎవరి మనస్సును వారు సంస్కరించుకోవడం ద్వారా స్వరూప దివ్యత్వంలోకి మేల్కొనగలరని దానికి అందరూ అర్హులేనని బోధించారు. ఏబది సంవత్సరములు జీవన్ముక్తునిగా అరుణాచలంలో సంచరించిన కాలంలో సరళంగా భగవాన్ బోధించిన ఆత్మ విద్య ఖండాంతరములకు ప్రాకినది. వారి బోధను ఆచరణలో పెడితే జన్మధన్యం అవుతుంది.

**- చావలి సూర్యనారాయణ మూర్తి, టీచర్, అమలాపురం**

# సెన్సు పెరిగే కొలది - నాన్‌సెన్సు తగ్గుతుంది

ఏది సత్యమో? ఏది అసత్యమో అని తెలుసుకోగలిగే బుద్ధి సహజంగా అనిత్యమైన దాన్ని విడిచిపెడుతుంది. ప్రకృతిలో ఏ వస్తువులోనూ ఆనందం పొందలేము. సరికదా బాధనే కలిగిస్తుంది అని గ్రహిస్తే వాటికి దూరంగా ఉండగలము. వివేకం పుష్పించి ఫలిస్తే వైరాగ్యమౌతుంది వివేకం ఎంత దృఢంగా ఉంటే వైరాగ్యం అంత సమర్థవంతంగా, అర్థవంతంగా ఆరోగ్యంగా ఉంటుంది. వస్తువుల్లో ఆనందం లేదు అని వస్తువులను మన సంస్కారాలతో చూచే దృష్టిలోనే ఆనందం ఉందని వస్తువులు నిత్యమూ మారుతూ నశిస్తూ ఉంటాయని గుర్తించిన బుద్ధిలో వివేకం ఉదయిస్తుంది. నిత్యానందం మనలోనే ఉందని గ్రహిస్తే నాన్‌సెన్సు విషయాలపట్ల మనం పరుగెత్తము. మనస్సు యుద్ధాన్ని అందిస్తుంది. అమస్కంలో ఏమీ ఉండదు. మనస్సు మనలను స్వంతం చేసుకోవటానికి ప్రయత్నిస్తుంది" మనసా ఎందుకు ఈ మిడిసిపాటు శరీరం బూడిద అవుతుంది. మరలా జనన మరణ చక్రంలో బంధించ బడతావు. నమ్రత, వినయం అలవర్చుకోవాలని పెద్దలు చెబుతారు అని మన మనస్సుకు మనం హితబోధ చేసుకోవాలి. శ్రీనాన్నగారు "మీ మనస్సులో మైనెస్ పాయింట్లను మనస్సే ఎలా పనిచేస్తున్నదో చూచుకోవాలి. ద్వేషం ఉంటే ద్వేషరహిత స్థితిలోకి వెళ్ళలేము. లోపల ఉన్న పాపమే ద్వేషంగా మారుతుంది. దానికి సాధన చెయ్యకపోతే కొన్ని జన్మలు వ్యర్థమౌతాయి" అన్నారు. మనం ఎవరిని దుర్భలులు అని అన్నా అది మన పాపమే. అంతా ఒకే పరమాత్మ నిండియున్నాడు మనం ఉన్నతస్తానంలో ఉన్నా న్యూనత స్తానంలో ఉన్నా రవ్వంత లెక్కచేయకూడదు. మన కాళ్ళమీద మనం నిలబడాలి భయాలు అన్నిటి వెనుక స్వార్థం ఉంటుంది. మనకు రెండు అంశాలు ముఖ్యం ఒకటి శాంతము, రెండు మౌనము. మనం ఇతరులతో పోల్చుకోకపోతే మనం మనంగా ఉండగలము. నిరంతరం మన మనస్సును విచారణ శీలమై ఉంచుకోవాలి. బ్రహ్మమే నేను అని నిశ్చయించుకోవాలి. నీటిలోని నాచు మొక్కలు దట్టంగా ఉంటే వాటిని ప్రక్కకు తొలగిస్తే తక్షణం మరలా నీటిని ఆ మొక్కలు కప్పివేస్తాయి. అలాగే బహిర్ముఖమైన ప్రాజ్ఞుణ్ణి కూడా మాయ వశం చేసుకొంటుంది. పరమేశ్వరుని కరుణ వల్లనే గురువు లభిస్తాడు. తరువాత మన సెన్సును ఆయనే ఉద్ధరించి నిజ గమ్యాన్ని చేరుస్తారు.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం**